క్లుప్తంగా

కేంద్రీయ విద్యాలయంలో వైద్య శిబిరం



చిన్నారులను పరీక్షిస్తున్న వైద్యులు

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెంలో గల కేంద్రీయ విద్యాలయలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. కేంద్రీయ విద్యాలయాల 62వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రిన్సిపాల్ కమల్‌జీత్ శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ సాలోమోన్ రాజు చిన్నారులను పరీక్షించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. శీతాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లు వివరించారు. కార్యక్రమంలో కేవీ చిన్నారులతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు



శివునికి హారతిస్తున్న అర్చకుడు

సీతంపేట: మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా సోమవారం శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక గణేష్‌నగర్‌లో గల పార్వతీశ్వరాలయంలో శివునికి అభిషేకం, అర్చన, హారతులిచ్చారు. పరిసర ప్రాంత భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాన్ని దర్శించి గోత్ర నామాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు గంగవరపు భాస్కర శర్మ మాట్లాడుతూ మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రం రోజున శివుడిని ఆరాధించడం వల్ల విశేష శుభ ఫలితాలు కలుగుతాయని తెలిపారు.

ఘనంగా ఆరుద్ర నక్షత్రం పూజలు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు ఉమానీలకంఠేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం మహా శివుడు జన్మనక్షత్రం ఆరుద్ర సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ పర్యవేక్షణలో పూజలు చేశారు. అర్చకులు రామారావు శర్మ, మహేష్, సిబ్బంది ఆధ్వర్యంలో భక్తులు పూజలు చేశారు.

అథ్లెటిక్స్‌కు అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న కమల్ బైడ్, సత్యదేవ్, తదితరులు

మురళీనగర్: ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్ – 2024లో విశాఖ క్రీడాకారులు సత్తా చాటారు. గుడివాడలో శని, ఆదివారం రెండు రోజులపాటు నిర్వహించిన పోటీల్లో వివిధ విభాగాల్లో 78 పతకాలు సాధించారు. విశాఖ వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ నుంచి 46 మంది అథ్లెట్స్ పాల్గొని 30 స్వర్ణాలు, 25 రజతం, 23 కాంస్య పతకాలు సాధించారు. వీరు సోమవారం విశాఖపట్నం చేరుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విశాఖ అథ్లెటిక్స్ అసోసియేషన్ న్యూ చీఫ్ పేట్రన్ కమల్ బైడ్ అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన సలహాదారు చింతలపాటి సత్యదేవ్, మాస్టర్ అథ్లెటిక్స్ సెక్రటరీ జనరల్ మంగ వరప్రసాద్, కార్యదర్శి ఎల్‌వీ.సుధాకర్, కోశాధికారి ఎం.రామారావు, కోఆర్డినేటర్ సీహెచ్.శ్రీనివాసరాజు, పీఆర్‌వో చింతలపాటి వంశీ పాల్గొన్నారు.

టీపీటీ కాలనీలో రోడ్డుపైకి మురుగు



రోడ్డు మీద ప్రవహిస్తున్న మురుగు నీరు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు పరిధి సీతమ్మధార టీపీటీ కాలనీలో యూజీడీ లీకేజీ కారణంగా మురుగునీరు రోడ్డెక్కింది. ఇక్కడి ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూలు సమీపంలో గల ఒక వీధిలో యూజీడీ కొద్ది రోజులుగా లీకవుతోందని స్థానికులు చెబుతున్నారు. పలు ప్రాంతాల్లో తరచూ లీకవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డు మీదకు మురుగునీరు రావడంతో తీవ్ర దుర్వాసన వస్తోందని, రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. సమీపంలోనే సచివాలయమున్నా పారిశుధ్య విభాగం కార్యదర్శి సైతం పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు పూర్తి స్థాయిలో యూజీడీకి మరమ్మతులు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

పదింతల శ్రద్ధ



సీతంపేటలో గల మధురానగర్ హైస్కూల్



- ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా విద్యార్థులకు బోధన
- ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు
- శత శాతం ఉత్తీర్ణత కోసం వంద రోజుల ప్రణాళిక అమలు

నియోజకవర్గంలోని పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు

- మధురానగర్ హైస్కూల్‌లో 91 మంది
- అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్‌లో 123 మంది
- సీతమ్మధార ఎన్‌ఎంసీ హైస్కూల్‌లో 168 మంది
- రైల్వే న్యూ కాలనీ కేఎన్‌ఎం గర్ల్స్ హైస్కూల్‌లో 64 మంది
- కప్పరాడ హైస్కూల్‌లో 118 మంది
- రైల్వే న్యూ కాలనీ హైస్కూల్‌లో 55 మంది
- ఏఎస్ఆర్ నగర్ కె.కాలనీ హైస్కూల్‌లో 99 మంది
- మాధవధార హైస్కూల్‌లో 155 మంది

సీతంపేట: పాఠశాల విద్యలో పదో తరగతి ఎంతో కీలకమైనది. పబ్లిక్ పరీక్ష కావడంతోపాటు ఉన్నత చదువులు చదవడానికి టెన్త్ క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంది. దీంతో సాధారణంగా టెన్త్ విద్యార్థుల్లో భయం నెలకొంటుంది. పబ్లిక్ పరీక్షల్లో ఉన్న భయాన్ని పోగొట్టి మంచి మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చుతున్నారు. శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కమిషన్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాలతో ప్రభుత్వ పాఠశాలల్లో వంద రోజుల ప్రణాళికను డిసెంబరు నెల ఒకటో తేదీ నుంచి అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా పదో తరగతి విద్యార్థులకు అదనపు తరగతులతోపాటు, పలు మార్గదర్శకాలను కమిషన్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విడుదల చేసింది. మార్చి 17 నుంచి 31 వరకు ఫైనల్ పరీక్షలు జరగనుండడంతో ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు వంద రోజుల ప్రణాళికను పటిష్టంగా అమలు చేస్తున్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గంలో ఉన్న 8 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 873 మంది విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణ సాధించేందుకు వంద రోజుల ప్రణాళిక ఈ నెల ఒకటో తేదీ నుంచి అమలు చేస్తున్నారు.



మధురానగర్ హైస్కూల్‌లో స్టడీ అవర్స్‌లో విద్యార్థులు

విద్యార్థులకు అదనపు తరగతులు

వంద రోజుల ప్రణాళికలో భాగంగా రోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5:30 వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. సాధారణ పని వేళలకంటే ఉదయం ఒక గంట, సాయంత్రం ఒక గంటన్నర అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం ఒక సబ్జెక్టు, సాయంత్రం మరో సబ్జెక్టు చదివిస్తున్నారు. అలాగే సెలవు రోజుల్లో కూడా టెన్త్ విద్యార్థులకు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం ఒక సబ్జెక్టు, మధ్యాహ్నం మరో సబ్జెక్టు చదివిస్తున్నారు.



మధురానగర్ హైస్కూల్‌లో వంద రోజుల ప్రణాళికను తనిఖీ చేస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్ (ఫైల్)

విద్యార్థులను దత్తత తీసుకుని...

పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులంతా ప్రతి ఒక్కరూ ఆరుగురు నుంచి 8 మంది టెన్త్ విద్యార్థులను దత్తత తీసుకున్నారు. దత్తత తీసుకున్న విద్యార్థులు ఎలా చదువుతున్నారు..?, ఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారు..?, వారిలో భయాన్ని పోగొట్టి ఆత్మవిశ్వాసం నింపేలా కృషి చేయాల్సి ఉంది. దత్తత తీసుకున్న విద్యార్థులు రోజూ బడికి వస్తున్నారా..?, మార్కులు ఎలా వస్తున్నాయి..? అన్న విషయాలు గమనిస్తుండాలి. రోజూ పరీక్షలు నిర్వహించడం, సందేహాల నివృత్తి చేయడం, వెనుబడిన సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ఫైనల్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా వారిని సన్నద్ధం చేయాలి. ఆ దిశగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

ఉపాధ్యాయుల గైడెన్స్ బాగుంది



ప్రతీ విద్యార్థి పదో తరగతిలో మంచి మార్కులు సాధించేలా ఉపాధ్యాయులంతా బాగా గైడ్ చేస్తున్నారు. రోజూ అదనపు తరగతులు, పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా వెనుకబడిన సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. నాకు సోషల్ సబ్జెక్టులో మార్కులు తక్కువ వస్తున్నాయి. మంచి మార్కులు సాధించేలా టీచర్ గైడ్ చేస్తున్నారు.
– కె.దామోదర్, టెన్త్ విద్యార్థి, మధురానగర్ హైస్కూల్

మంచి మార్కులు సాధిస్తా



ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో వంద రోజుల ప్రణాళిక ప్రకారం చదువుతున్నాం. అన్ని సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధిస్తామనే నమ్మకం కలుగుతోంది. నేను హిందీ సబ్జెక్టులో కాస్త వెనుకబడి ఉన్నాను. ఉపాధ్యాయుల సలహాలు, సూచనలతో మంచి మార్కులు సాధిస్తాను. రోజూ అదనంగా స్టడీ అవర్స్, సెలవు రోజుల్లో కూడా తరగతులు నిర్వహించి ఉపాధ్యాయులు దగ్గరుండి చదివిస్తున్నారు. వంద రోజుల ప్రణాళిక ఉపయోగకరంగా ఉంది.
–యం.యజశ్వి, టెన్త్ విద్యార్థిని, మధురానగర్ హైస్కూల్

విద్యార్థులకు అనుగుణంగా బోధన



జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాలతో శత శాతం ఉత్తీర్ణత కోసం పాఠశాలలో వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నాం. మధురానగర్ హైస్కూల్‌లో 91 మంది టెన్త్ చదువుతున్నారు. పాఠశాలలో 17 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఒక్కొక్కరు ఆరుగురు విద్యార్థులను దత్తత తీసుకుని, చదివిస్తున్నారు. ఎఫ్ఏ 1, ఎఫ్ఏ 2లో వచ్చిన మార్కులు ఆధారంగా ఏ, బీ, సీ, డీ గ్రేడులుగా విద్యార్థులను విభజించి, వారి అభ్యసనా సామర్థ్యాన్ని బట్టి ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తున్నాం. పిల్లల స్థాయినిబట్టి బోధించేందుకు ఉపాధ్యాయులు స్టడీ మెటీరియల్ సిద్ధం చేసుకున్నారు.
–శాంతికుమారి, ప్రధానోపాధ్యాయురాలు, మధురానగర్ హైస్కూల్

ప్రభుత్వ స్థలం రక్షణకు చర్యలు



జీవీఎంసీ 26వ వార్డు శాంతిపురంలో ప్రభుత్వ స్థలం చుట్టూ నిర్మిస్తున్న ప్రహరీ

సాక్షి ఎఫెక్ట్..

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు శాంతిపురంలోని హైవే పక్కన పద్మశ్రీ ఆస్పత్రి ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలానికి అధికారులు రక్షణ చర్యలు చేపట్టారు. ఖాళీ స్థలం చుట్టూ సిమెంట్ ఇటుకలతో గోడ నిర్మిస్తున్నారు. స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించి గేటు ఏర్పాటు చేస్తామని కాంట్రాక్టర్ తెలిపారు. టౌన్‌ప్లానింగ్ అధికారుల ఆదేశాలతో రక్షణ చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ఇక్కడ సుమారు 120 గజాల జీవీఎంసీ స్థలాన్ని గతంలో కొంతమంది ఆక్రమించాడానికి యత్నించగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అడ్డుకుని, స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసి రక్షణ కల్పించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఫెన్సింగ్ మాయమై రక్షణ కరువైందని ఈ నెల 7న 'ఆక్రమణ చెరలో ప్రభుత్వ స్థలాలు' శీర్షికతో సాక్షిలో ప్రచురించిన వార్తకు జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ స్పందించారు. రక్షణ చర్యలు చేపట్టాలని జోన్ – 3 అధికారులను ఆదేశించడంతో ప్రహరీ నిర్మిస్తున్నారు. ఎంతో విలువైన ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం కాకుండా రక్షణ చర్యలు చేపడుతుండడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వ్యర్థాల తొలగింపు



పనులు పర్యవేక్షిస్తున్న రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు లేన్సమ్ గ్రీన్స్ నుంచి మాధవధార వైపు రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ఈ మేరకు వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ వాకింగ్‌కు వెళ్లినప్పుడు వాటిని పరిశీలించి వెంటనే జీవీఎంసీ అధికారులతో మాట్లాడి పేరుకుపోయిన చెత్త, గెడ్డలోని వ్యర్థాలు టిప్పర్, ఇతర పరికరాల సహాయంతో తీయించి తరలించారు. శానిటేషన్ సిబ్బందితో దగ్గరుండి పని చేయించారు.

రక్షణగిరిపై నవదిన ప్రార్థనలు



కొవ్వొత్తులతో దీపారాధన చేస్తున్న మహిళలు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పునీత పేతురి చర్చి ఫాదర్ రెవరెండ్ జొన్నాడ జాన్‌ప్రకాష్, పారిస్ పాస్టిల్ కౌనిల్స్ (పీపీసీ) సంయుక్త ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకల్లో భాగంగా సోమవారం నవదిన ప్రార్థనలు ఘనంగా ప్రారంభించారు. ఉదయం 4 గంటలకు కొవ్వొత్తులతో జ్ఞానాపురం వీధుల్లో ప్రదక్షిణ చేశారు. ప్రత్యేక ప్రార్థనలకు అతిథులుగా అర్చిబిషప్ మరియదాస్, బిషప్ పాల్ మైపాన్, ఫాదర్ వేళంగిణిరాజు పాల్గొని దీపారాధన ప్రారంభించారు. అనంతరం బాబుకాలనీ, జీఎన్ ఎన్ఆర్‌యూఎం కాలనీల్లో మహిళలు కొవ్వొత్తులతో ప్రదర్శనలు నిర్వహించారు. క్రీస్తు రాకకోసం ప్రజలు భక్తిశ్రద్ధలతో మెలగాలన్నారు. నవ దినాలు జరిగే దీపారాధనలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు. ప్రసంగాల అనంతరం దివ్యబలి పూజలు చేశారు. కార్యక్రమంలో పీపీసీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జీవోలతో ఆటోడ్రైవర్లపై భారం మోపొద్దు



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సీతమ్మధార: ఆటో డ్రైవర్లపై ఆర్థిక భారం మోపే జీవో నంబర్ 21, 31లను రద్దు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఇందులో భాగంగా బాలయ్య శాస్త్రి లే అవుట్ వద్ద గల బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకి సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వామనమూర్తి మాట్లాడుతూ సదరు రెండు జీవోల కారణంగా ఆటో డ్రైవర్లు పలు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సమస్యలను ఫిబ్రవరిలో జరిగే శాసనసభ సమావేశాల్లో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆటో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు యు.శివాజీ, నాయకులు ఎస్.మధు రెడ్డి, భాస్కర్, దేముడు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ రమేష్



అర్జీదారుల సమస్యలు వింటున్న జెడ్సీ రాము

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీదారులు వినతులు అందజేశారు. తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎం.రమేష్ అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యాలయం పరిధిలో రెవెన్యూ సదస్సులు జరుగుతున్నందున భూ సమస్యలు, వివాదాలకు సంబంధించిన అర్జీలను సదస్సుల్లో అందజేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎ.త్రినాథ్, ఆర్ఐ ప్రేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

- ఆశీలమెట్టలోని జీవీఎంసీ జోన్–3 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి నాలుగు అర్జీలు అందాయి. ప్రజల నుంచి వాటిని జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ స్వీకరించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుల పరిష్కారం సమాచారాన్ని ఫిర్యాదుదారులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఈ గంగాధర్, డీఈఈ పద్మావతి, ఏఎంహెచ్‌వో డాక్టర్ భాస్కరరావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ గోపన్న, యూసీడీ విభాగం ఏపీడీ ఎల్.రాము, ఆర్వో పైడిరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కంచరపాలెం: జీవీఎంసీ జోన్ – 5 జ్ఞానాపురం కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు పలు సమస్యలపై 4 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము సోమవారం వినతులు స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్లు వెంకటరమణ, రాజు, రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ తారా ప్రసన్నరెడ్డి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్, ఏపీడీవోలు కృపానందం, ఎస్.పుణ్యవతి పాల్గొన్నారు.

మ్యాథ్స్ పరీక్ష వాయిదా

సీతంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం జరగాల్సిన సమ్మేటివ్ - 1 మ్యాథ్స్ పరీక్ష రద్దు చేశారు. ఈ రోజు జరగాల్సిన సమ్మేటివ్ - 1 లెక్కల పేపర్ యూట్యూబ్‌లో ప్రత్యక్షం కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు పరీక్ష రద్దు చేశారు. ఉత్తర నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల్లో గణితం పరీక్ష ఆగిపోయింది. ఈ నెల 20న మరలా పరీక్ష నిర్వహిస్తామని పాఠశాలల హెచ్‌ఎంలు తెలిపారు.

నెల గంటతో ధనుర్మాసోత్సవాలు ప్రారంభం

వైష్ణవాలయాల్లో వైభవంగా పూజలు



గోదాదేవి అలంకరణలో ధనలక్ష్మి దేవి

సీతంపేట: ఉత్తర నియోజకవర్గంలో నెలగంట మోగింది. ప్రముఖ వేంకటేశ్వరస్వామి, రామాలయాలు, కృష్ణాలయాలు, వేణుగోపాల స్వామి ఆలయాల్లో సోమవారం ఉదయం నెలగంట పూజతో ధనుర్మాసం ఘనంగా ప్రారంభమైంది. విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, గంట పూజ, అర్చన, తిరుప్పావై మొదటి పాశుర విన్నపముతో ప్రారంభించారు. అక్కయ్యపాలెం లలితానగర్‌లో గల శ్రీలలితాపీఠం, శ్రీనివాసనగర్‌లోని శ్రీలక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం, సీతంపేట రాధాకృష్ణ ఆలయంలో ధనుర్మాసం పూజలు మొదలయ్యాయి. శ్రీలలితాపీఠంలో గోదాదేవికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం పీఠంలో కొలువైన కల్యాణ వేంకటేశ్వర స్వామికి పూజలు చేశారు. నిత్య కైంకర్యంలో భాగంగా వేంకటేశ్వర స్వామికి, అమ్మవార్లకు అర్చన, మంత్రపుష్పం, తీర్థ ప్రసాదగోష్టి నిర్వహించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. శ్రీనివాసనగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో వేంకటేశ్వరస్వామి, పద్మావతి, గోదాదేవి, ఆండాళ్లమ్మకు పూజలు చేసి ధనుర్మాన ఉత్సవాలను ప్రారంభించారు.

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం పరిధి నేతాజీ కూడలిలో వెలసిన శ్రీసీతారామ సంపత్ వేంకటేశ్వర, ధనలక్ష్మీదేవి ఆలయంలో సోమవారం గొల్లకంచరపాలెం గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో ధనుర్మాస మహోత్సవాలు వైభవంగా ప్రారంభించారు. ప్రాతఃకాలార్చన, తిరుప్పావై సేవ, విశేష భోగం, పాశుర విన్నపం నిర్వహించారు. ధనలక్ష్మి దేవిని గోదాదేవిలా అర్చకులు శర్మ అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు పనులు పర్యవేక్షించారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.



శ్రీలలితాపీఠంలో పూజలు చేస్తున్న అర్చకుడు



శ్రీలలితా పీఠంలో పాశురం విన్నవిస్తున్న భక్తులు

వైభవుని సన్నిధిలో ధనుర్మాసోత్సవాలు ప్రారంభం

మురళీనగర్: కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ధనుర్మాసోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జనవరి 13 వరకు నిర్వహించనున్న ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 6 గంటలకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అనంతరం రంగనాథ స్వామికి తిరుప్పావై సేవా కాలంలో భాగంగా గోదాదేవి తరపున పాశుర విన్నపం చేశారు. అనంతరం జేగంట మోగించి ఉత్సవాలను అర్చకుడు వాసుదేవాచార్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. జనవరి 13 వరకు రోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ చెప్పారు.

- మురళీనగర్ రామాలయంలో ధనుర్మాసోత్సవాలు సోమవారం ప్రారంభించారు. అర్చకుడు గొడవర్తి రఘురామాచార్యులు ఆధ్వర్యంలో ఉత్సవాలు ప్రారంభించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని సీతారాములను దర్శించుకున్నారు. రోజూ సీతారామచంద్ర స్వామికి తిరుప్పావై పాశుర విన్నపములు, విశేష అర్చనలు నిర్వహిస్తామని ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టి.ఎస్.రెడ్డి, సనపల వరప్రసాద్ తెలిపారు.



ఉత్సవాలు ప్రారంభిస్తున్న వాసుదేవాచార్యులు



ధనుర్మాసోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

రెండు పుస్తకాలు ఆవిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న ద్విభాష్యం రాజేశ్వరరావు

సీతంపేట: నగరానికి చెందిన రచయిత సుసర్ల సర్వేశ్వర శాస్త్రి రచించిన మూడు నాటికల సంపుటి, ఒక అపరాధ పరిశోధన నవలావిష్కరణ సభ సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించారు. విశాఖ రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన సభలో ప్రముఖ కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు నాటికల సంపుటి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రచయిత తన అంతరంగం లోతుల్లోకి వెళ్లి, దాని గాఢతను పరిశీలించి కథ, నాటిక రాస్తే అది చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. గాడేపల్లి సుందరరావు నవలను ఆవిష్కరించారు. అడపా రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో డాక్టర్ ఎస్.కృష్ణబాబు, శిరేల సన్యాసిరావు, మేడా మస్తాన్‌రెడ్డి, పంతుల లలిత, పలువురు సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

రెవెన్యూ స్థలంలో అక్రమ నిర్మాణం కూల్చివేత



సీతంపేటలో రెవెన్యూ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట కనకమ్మ వారి వీధి (హరిజన వీధి)లో గల రెవెన్యూ స్థలంలో సుమారు 60 గజాల స్థలం ఆక్రమించి అక్రమంగా నిర్మిస్తున్న ఇంటిని రెవెన్యూ సిబ్బంది పర్యవేక్షణలో జీవీఎంసీ సిబ్బంది సోమవారం కూల్చివేశారు. పోలీసుల రక్షణ మధ్య అక్రమ నిర్మాణాలు తొలగించారు. జీవీఎంసీ 25, 26 వార్డుల్లో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికావడంతో 'ఆక్రమణ చెరలో ప్రభుత్వ స్థలాలు' శీర్షికతో ఈ నెల 7న సాక్షిలో ప్రచురించిన వార్తకు రెవెన్యూ, జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించారు. 25వ వార్డులో గల రెవెన్యూ స్థలంలో ఈ నెల 9న ప్రభుత్వ స్థలమని పేర్కొంటూ బోర్డు ఏర్పాటు చేశారు. రెవెన్యూ స్థలంలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను సోమవారం పోలీస్ సిబ్బంది పర్యవేక్షణలో తొలగించారు. ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ బోర్డు ఏర్పాటు చేశారు.

ఆదిలక్ష్మి కుటుంబాన్ని ఆదుకోవాలి

సీతమ్మధార: వైఎస్సార్ సెంట్రల్ పార్క్‌లో గార్డెన్‌గా పనిచేస్తున్న కిలాని ఆదిలక్ష్మి ఆదివారం సాయంత్రం డ్యూటీ దిగే సమయంలో గుండెపోటుతో మరణించిందని, ఆమె కుటుంబానికి పరిహారం చెల్లించి ఆదుకోవాలని వీఎంఆర్‌డీఏ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు సోమవారం డిమాండ్ చేశారు. ఆమె కుమారుడికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. శంకరమఠం రోడ్‌లో ఆదిలక్ష్మి భౌతిక కాయానికి యూనియన్ గౌరవాధ్యక్షుడు వి.కష్ణారావు, కార్మికులు నివాళులర్పించారు. మృతురాలికి భర్త కనక అప్పారావు, కుమారుడు, కుమార్తె ఉన్నారని... వారికి ఆమె ఉద్యోగమే ఆధారమని పేర్కొన్నారు. ఆమె కుమారుడు భరత్ సాయికి ఉద్యోగం ఇప్పించాలని కోరారు.